క్లుప్తంగా

దుప్పట్ల వితరణ

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని గారమ్మ కాలనీలో మాజీ కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి పలువురు పేదలకు దుప్పట్లు గురువారం వితరణ చేసి, అన్నదానం చేశారు. ఆయన తండ్రి గుమ్మిడి అప్పలసూరి 12వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు చేసినట్లు సింహాద్రి తెలిపారు.

ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జేసీఎస్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఉషారాణి

భామిని: మండలంలోని బాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 34 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు జేసీఎస్ కో–ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపీటీసీ పాలక ఉషారాణి చేతుల మీదుగా ట్యాబ్‌లు గురువారం అందజేశారు. విద్యార్థులకు డిజిటల్, సాంకేతిక విద్యనందించే సదుద్దేశ్యంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేడిబోయిన చలపతి, రొక్కం రామారావు, ప్రధానోపాధ్యాయుడు జామి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీవో పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో లావణ్య

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీసీసీ ఎం.ఎల్.ఎస్.స్టాక్ పాయింట్(మెయిన్ గొడౌన్)ను పాలకొండ ఆర్‌డీవో ఆర్.లావణ్య గురువారం సందర్శించి, అక్కడి నిత్యావసర సరుకులకు సంబంధించిన రికార్డులు, నిల్వలను పరిశీలించారు. రేషన్ డిపోలు, ఆశ్రమ, వసతి గృహాలు, పాఠశాలలకు సకాలంలో నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని, పక్కాగా రికార్డులు నిర్వహించాలని సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావుకు సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం, పొట్లి, అవలంగి, ఎం.సింగుపురం, డోలమడ, జంపరకోట, మల్లివీడు, బద్దుమాసింగి, పనుకువలస, టీకే రాజుపురం, బెజ్జి, అట్టలి, వాటపాగు, తుమరాడ, చింతాడ గ్రామాలతో పాటు, వీరఘట్టం మండలంలోని తెట్టంగి, నీలానగరం, మొట్ట వెంకటాపురం, తలవరం, పనసనందివాడ, వండువ, బిటివాడ, బిడ్డపాడు, ఆడారు, పాపంపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఈ నెల 30వ తేదీన అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పాలకొండ మండలంలోని నవగాం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెరుగైన విద్యుత్ సరఫరాకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, హెచ్చరిక బోర్డులు, సూచీల ఏర్పాటు పనుల కారణంగా ఈ అంతరాయం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

భూసర్వే వేగవంతం చేయండి



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న డీఐఎస్‌లు ప్రసాద్, ప్రేమ్‌కుమార్

భామిని: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని పాలకొండ డివిజన్ డీఐఎస్‌లు సీహెచ్‌కే ప్రసాద్, జి.ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని నులకజోడు, బిల్లుమడ గ్రామాల మధ్య జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం పరిశీలించిన వారు పలు సూచనలు చేశారు. రైతులకు మేలు జరిగేలా పక్కాగా సర్వే చేపట్టాలన్నారు. సర్వే సిబ్బందికి రైతులు కూడా సహకరించాలని కోరారు. అలాగే రైతుల సమక్షంలో జిరాయితీ భూముల గుర్తించాలని సిబ్బంది తెలిపారు.

అన్నదానం



అన్నదానం స్వీకరించేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు గురువారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో గురువారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్.



సీతంపేట: క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకబ్ దయానంద్



సీతంపేట: కబడ్డీ పోటీలో తలపడుతున్న వజ్జాయిగూడ క్రీడాకారులు



పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడేందుకు సిద్ధమైన క్రీడాకారులు



వీరఘట్టం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

‘పది’లో ఉత్తమ ఫలితాలకు కృషి



గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ పాఠశాల(బాలురు)లో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ విద్యార్థి చదువులో బాగా రాణించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చూడాలన్నారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈవో–1 నాగభూషణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, పలు సలహాలు, సూచనలు చేశారు. జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాష్‌ల ద్వారా ఎవరికి బోధిస్తారు.. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఎలా పెంచవచ్చన్న అంశాలను వివరించారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి, ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.



గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో నాగభూషణరావు

ఉత్తమ ఫలితాలు సాధించాలి..

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు ఎంఈవో ఎస్.నాగభూషణరావు సూచించారు. గురువారం మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమై, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. మార్చి నెలలో పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతీ పదో తరగతి విద్యార్థి కష్టపడి బాగా చదవాలన్నారు. సంక్లిష్టమైన సబ్జెక్ట్‌లపై తొలుత దృష్టిసారించాలన్నారు. ఏయే అంశాల్లో విద్యార్థులు వెనకబడి ఉన్నారో వారిని గుర్తించి, ఆయా అంశాలపై పట్టుసాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలపై ఆసక్తి..

వీరఘట్టం: తరగతి గదిలో బోధించే పాఠాలతో పాటు ప్రయోగ పరీక్షలపై కూడా విద్యార్థులకు ఆసక్తి పెంచాలని ఎంఈవో డి.గౌరినాయుడు సూచించారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన పలు సూచనలు చేశారు. కృత్యాధార బోధన చేపట్టాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు చేపట్టాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.పి.నాగమణి, డీఆర్‌పీ ఎ.కేశవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ..

పాలకొండ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె.సోంబాబు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మీసాల సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వీరఘట్టం మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ గురువారం ఇచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలని, కెరీర్ గైడెన్స్, ఇన్నోవేటివ్ క్లాస్‌రూమ్ రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి..

సీతంపేట: సకాలంలో సిలబస్ పూర్తి చేసి, పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని పీఎంఆర్‌సీ ఏఎంవో పి.కోటిబాబు తెలిపారు. స్థానిక ఏపీ టీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల, గిరిజన బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇక్కడ నేర్చుకునే అంశాలను పక్కాగా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎంఈవో నాగభూషణరావు



వీరఘట్టం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గౌరినాయుడు



సీతంపేట: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఏఎంవో కోటిబాబు

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమైన ఆమె ప్రభుత్వం కొత్తగా ఆరోగ్యశ్రీ పథకంలో తీసుకువచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇదివరకు ఈ పథకం కింద కొన్ని వ్యాధుల వరకే ఉచితంగా చికిత్స ఉండేదని, ఇప్పుడు కొత్తగా మరికొన్ని వ్యాధులను కూడా చేర్చి, వాటికి కూడా ప్రభుత్వం ఉచితంగా చికిత్స చేయించడం జరుగుతోందని తెలిపారు.

ఇదిలా ఉండగా, ఈ పథకం వ్యయ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన విషయం కూడా ప్రజలందరికీ తెలిసేలా చూడాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్లు అప్పారావు, ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పాలకొండ: మండల కేంద్రంలోని పలు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ఓటర్లకు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టగా, మొబైల్ అధికారులు పి.ఈశ్వరరావు, ఎ.ధర్మారావు, జి.ప్రసాదరావు, ఎస్.రాజారావు కలిసి, సిబ్బంది, ఓటర్లకు ఈవీఎం వినియోగించి, ఏ విధంగా ఓటు వేయాలన్న దానిని వివరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లంతా తమ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్త పింఛన్ దరఖాస్తుల పరిశీలన

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు, అర్హతలను ఎంపీడీవో డొంక త్రినాధులు గురువారం పరిశీలించారు. మండలం నుంచి కొత్తగా 88 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారు నిజంగా అర్హులేనన్న విషయాన్ని ఆధారాలను ఆధారంగా చేసుకుని, ఎంపీడీవో నిశితంగా గమనించారు. మండలంలోని డోలమడ, జంపరకోట, ఎం.సింగుపురం, నవగాం గ్రామాలకు వెళ్లిన ఆయన ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. అలాగే ఆరోగ్య వ్యయ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిన విషయాన్ని, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రినాధులు

సచివాలయ కార్యదర్శుల చేతికి ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు

గరుగుబిల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేయమని సచివాలయ కార్యదర్శులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను ఎంపీడీవో జి.పైడితల్లి గురువారం అందజేశారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 8,857 మంది లబ్ధిదారులకు కార్డులు మంజూరయ్యాయని, వీటిని అర్హులకు అందించాలని ఎంపీడీవో వారికి తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఎస్.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ కార్యదర్శులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

సర్వేను వినియోగించుకోవాలి

సీతంపేట: పీవీటీజీ సర్వేను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఓ ప్రకటనలో గురువారం ప్రజలను కోరారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి, సర్వే కూడా చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు గృహాలు మంజూరు కాని వారు, పూరిళ్లల్లో నివశిస్తున్న వారి వివరాలు సేకరించడం జరుగుతోందన్నారు. దీనివల్ల పేదలకు లబ్ధి జరుగుతుందన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

భామిని: మండలంలోని పసుకుడి–సింగిడి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పసుకుడి వద్ద శిథిలమైన ఈ రోడ్డును జేసీబీలతో సరిచేస్తూ రోడ్డు లెవల్ పనులు చకచకా జరుగుతున్నాయి. గతేడాది లివిరి నుంచి బిల్లుమడ వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేయగా, లివిరి నుంచి పసుకుడి మధ్య 6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు మళ్లీ పసుకుడి వద్ద రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పసుకుడి వద్ద పాతరోడ్డును జేసీబీ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

ఆత్మీయ సమ్మేళనం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక బీఎస్‌ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద కళింగ వైశ్యుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ సభ్యులంతా సంఘ బలోపేతం, ఆర్థికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎంఎంటీసీ డైరెక్టర్ మద్ది శ్రీనివాసరావును కళింగ వైశ్యులంతా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన కళింగ వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

‘ఉపాధి’ మేట్లకు శిక్షణ

కొమరాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం మేట్లకు ఇచ్చే శిక్షణను ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి కలిసి గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 324 మంది మేట్‌లకు మూడు రోజుల పాటు మూడు కేంద్రాల్లో వారి విధుల నిర్వహణపై అవగాహన కల్పించనున్నామన్నారు. కొలతల ప్రకారం పనులు చేయించడం, మస్తర్లు వేయడం, జాబ్‌కార్డు అప్‌డేషన్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో వి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని ఉపాధి హామీ పథకం మేట్‌లకు ఏపీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటిక గ్రామంలో పెదబుడ్డిడి, ఇటిక, అంకవరం, గెడ్డతిరువాడ, కుందరతిరువాడ గ్రామపంచాయతీల మేట్‌లకు, బిత్రపాడు గ్రామంలో పెదమేరంగి, కన్నపుదొరవలస, గవరమ్మపేట, బిత్రపాడు పంచాయతీల మేట్‌లకు శిక్షణ ఇచ్చినట్లు ఏపీవో తెలిపారు. వేతనదారులకు కనీస వేతనం వచ్చేలా పనిచేయించడం, జాబ్‌కార్డ్ ఏ విధంగా అప్‌డేట్ చేయాలి, మస్తర్లు వేయడంపై మేట్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక వక్త గుంటపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని సింగన్నవలస గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర నేతృత్వంలో ధర్మరక్షా దివస్ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

అందరూ హిందూ ధర్మ, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పి.సూర్యనారాయణ, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.